సాక్షి విశాఖపట్నం

గురువారం । 23 । మార్చి । 2023



'పది'ంతల శ్రద్ధ

ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరిగే 10వ తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. 8లో



బతుకు బండి

దశాబ్దాల క్రితమే కాలం చెల్లినా.. డిమాండ్ తగ్గినా ఇప్పటికీ కొందరు రిక్షాలతోనే తమ అనుబంధాలను కొనసాగిస్తున్నారు. 8లో



సినీ పరిశ్రమకు విశాఖ వేదిక

తిమ్మాపురంలోని వైజాగ్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ (వీఎఫ్‌సీసీ)లో బుధవారం ఘనంగా ఉగాది వేడుకలు నిర్వహించారు. 10లో

న్యూస్‌రీల్

స్టీల్‌ప్లాంట్‌కు జాతీయ ఇస్పాత్ పురస్కార్



అవార్డు అందుకుంటున్న సీజీఎం, నాయకులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు జాతీయ స్థాయి ఇస్పాత్ పురస్కార్ అవార్డు లభించింది. బుధవారం జాయింట్ కమిటీ ఆన్ సేఫ్టీ,హెల్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఇన్ స్టీల్ ఇండస్ట్రీ (జేసీఎ స్ఎస్ఐ) ఆధ్వర్యంలో రాంచీలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్లాస్ట్‌ఫర్నేస్, రా మెటీరియల్ జోన్‌లకు ఈ అవార్డులు లభించాయి. అదే విధంగా కాంట్రాక్టు కార్మికుల పాల్గొన్న ప్రదేశాల్లో జీరో ఫేటల్ యాక్సిడెంట్ అవార్డును కూడా అందజేశారు. స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగం సీజీఎం ఎం.ఎస్.వి.కృష్ణయ్య, ఉక్కు కార్మిక నాయకులు మంత్రి రాజశేఖర్, జె.రామ కృష్ణ, దొమ్మేటి అప్పారావు, కొమ్మినేని శ్రీనివా సరావు ఈ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఇన్‌చార్జ్ ఎ.కె.బాగ్చీలు ఉక్కు ఉద్యోగులను అభినందించారు.

సీతారాముల కల్యాణ రాట



కల్యాణరాట వేస్తున్న ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత ఆలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం సీతారామచంద్ర స్వామి పెళ్లి రాట వేడుకగా సాగింది. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఉదయం కల్యాణ రాట వేసి, స్వామిని పెండ్లి కుమారుని చేశారు. అనంతరం విశేష ఆరాధన, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ నెల 30న శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్త అనురాధ, పులి రామారావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో విస్తృత తనిఖీలు



ముడసర్లోవ వద్ద కే-9 స్నిఫర్ డాగ్స్‌తో తనిఖీ చేస్తున్న సిబ్బంది

అల్లిపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జీ-20 సదస్సు నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ ఆదేశాల మేరకు వీఐపీలు సందర్శించే ప్రదేశాలలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. కే-9 స్నిఫ్పర్ డాగ్స్ టీమ్స్, యాంటీ సాబోటేజ్ చెక్ టీమ్స్‌తో ముడసర్లోవ పార్కు, కైలాసగిరి హిల్స్, రాడిసన్ బ్లూ హోటల్ ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

ఊహ మహంతికి అంతర్జాతీయ గ్లోరీ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఊహ మహంతి

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర జిల్లాల్లో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ ఊహ మహంతికి మనం ఫౌండేషన్ ఇంటర్నేషనల్ గ్లోరీ అవార్డు ప్రకటించింది. బుధవారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో విశాఖ సీబీఐ కోర్టు ప్రిన్సిపల్ జడ్జి సత్య వెంకట హిమబిందు చేతుల మీదుగా ఊహ మహంతి ఈ అవార్డు అందుకున్నారు. మారుమూల ప్రాంతాల పేదలకు విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని ప్రిన్సిపల్ జడ్జి సూచించారు. భవిష్యత్‌లో పేద గిరిజన బాలికల అభ్యున్నతికి మరింత కృషి చేస్తానని అవార్డు గ్రహీత పేర్కొన్నారు.

G20 విశాఖకే తలమానికం

- సదస్సులో ప్రజలు భాగస్వాములు కావాలి
- నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలి
- సుందరీకరణ పనులు 90 శాతం పూర్తయ్యాయి
- 'సాక్షి'తో మేయర్ గొలగాని హరివెంకటకుమారి



దాబాగార్డెన్స్: విశాఖ నగరంలో జీ-20 సదస్సు నిర్వహించడం గర్వకారణంగా భావిస్తున్నట్టు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. జీ-20 సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పర్యాటకులకు కల్పించిన సౌకర్యాలపై బుధవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. 'విశాఖ కీర్తిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఇక్కడి ప్రజలు తరఫున కృతజ్ఞతలు. జీ-20 నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు అద్భుతం. ఈ సదస్సుకు దాదాపు 40 దేశాల నుంచి 200 మందికి పైగా ప్రతినిధులు హాజరవుతున్నారు. వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. షీలానగర్ నుంచి ఎన్ఏడీ, తాటిచెట్లపాలెం, తెలుగుతల్లి ఫ్లైఓవర్ వరకు కోట్లాది రూపాయలతో సుందరీకరణ పనులతో పాటు రోడ్లు, విద్యుత్ అలంకరణ, ఆకర్షణీయమైన పెయింటింగ్ పనులు చేపట్టాం. సాగరతీరంలో కోస్టల్ బ్యాటరీ నుంచి రాడిసన్ హోటల్ వరకు విశాఖ తీర అందాలు అతిథులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాం. ఆర్.కె.బీచ్, సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, సీతకొండ తదితర ప్రాంతాల్లో వ్యూ పాయింట్లను అతిథులు మెచ్చే విధంగా ఆకర్షణీయంగా రూపొందించాం. ప్రాంతాలు తెలిపే సూచిక బోర్డుల ఏర్పాటు, వేలాడుతున్న కేబుల్ వైర్లను తొలగించాం. ఎక్కడా వ్యర్థాలు లేకుండా అన్ని చర్యలు చేపట్టాం. దేశ ఔన్నత్యాన్ని చాటే విధంగా పలు ప్రాంతాలను తీర్చిదిద్దాం.'అని మేయర్ వివరించారు.

ప్రజల భాగస్వామ్యం కావాలి

'జీ-20 సదస్సు విశాఖకే తలమానికం. విశాఖ నగర పౌరులుగా గొప్ప కార్యక్రమంలో భాగస్వాములవుదాం. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా పరిశుభ్రంగా ఉంచుదాం. దేశ విదేశీ ప్రతినిధులకు మన సంస్కృతి, సంప్రదాయాలను చూపిద్దాం.'అని మేయర్ పిలుపునిచ్చారు. ఈ సదస్సు ఉద్దేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆమె వివరించారు. 'యోగా ఆల్' పేరిట వైఎస్సార్ సెంట్రల్ పార్క్, వుడా పార్కులో యోగా తరగతులు నిర్వహించాం. 'మాక్ జీ-20 కాన్క్లేవ్'పేరిట బుధవారం విద్యార్థులతో సదస్సు చేపట్టాం. 24న సాగరతీర స్వచ్ఛత పేరిట బీచ్ క్లీనింగ్, 25న చిత్రలేఖనం పోటీలు, 26న వైజాగ్ సిటీ మారథాన్, వైజాగ్ కార్నివాల్ పేరిట థింసా, కోలాటం, వీరనాట్యం, కూచిపూడి వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. 'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ సమావేశానికి హాజరయ్యే ప్రతినిధులు ముడసర్లోవలోని సోలార్ ప్రాజెక్టు, కాపులుప్పాడలోని జిందాల్ రీసైక్లింగ్ ప్లాంట్, జీవీఎంసీలోని కమాండ్ కంట్రోల్ ఆపరేషన్, తాగునీటి ప్రాజెక్టు, కైలాసగిరి, ఆర్కేబీచ్ తదితర ప్రాంతాలను తిలకించనున్నారు' అని మేయర్ తెలిపారు.

హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు

'జీ-20 సదస్సుకు విశాఖ వేదికగా నిలవడం సంతోషంగా ఉంది. ఈ సమావేశాలకు 40 దేశాల నుంచి ప్రతినిధులు రానున్నారు. విదేశాంగ మంత్రులు, రాయబారులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. రెండు స్టార్ హోటళ్లలో సమ్మిట్ జరగనుంది. అతిథుల కోసం నగరంలోని వివిధ స్టార్ హోటళ్లలో 300 గదులు బుక్ చేశారు. హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేస్తున్నారు.' అని మేయర్ వివరించారు.

కోట్లాది రూపాయలతో నగర సుందరీకరణ



'రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జీ-20 సదస్సుకు సంబంధించి కోట్లాది రూపాయలతో చేపట్టిన సుందరీకరణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. జోన్-1 పరిధిలో రూ.412.86 లక్షలతో 20 పనులు, జోన్-2 పరిధిలో రూ.1353.77 లక్షలతో 73 పనులు, జోన్-3 పరిధిలో 1371.62 లక్షలతో 59 పనులు, జోన్-4 పరిధిలో 1908.65 లక్షలతో 35 పనులు, జోన్-5 పరిధి-ఏలో 752.44 లక్షలతో 33 పనులు, బిలో రూ.169.91 లక్షలతో 11 పనులు, జోన్-8 పరిధిలో రూ.1908.89 లక్షలతో 27 అభివృద్ధి పనులు ప్రారంభించాం. ఇందులో దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. విద్యుత్‌కు సంబంధించి రూ.1168.47 లక్షలతో 56 పనులు, మెకానికల్‌కు సంబంధించి 287.41 లక్షలతో 4 పనులు, పీడీ-1కి సంబంధించి రూ.932.25 లక్షలతో 12 పనులు, పీఎల్ అండ్ సీకి సంబంధించి రూ.878.99 లక్షలతో 53 పనులు జరుగుతున్నాయి. మొత్తంగా ఇప్పటి వరకు 70 శాతం పైబడి పనులు పూర్తయ్యాయి' అని మేయర్ వివరించారు.

శోభ నిండుగా.. శుభాలు మెండుగా..



సంపత్ వినాయగర్ ఆలయం వద్ద భక్తుల రద్దీ

శుభకృత్ శుభమంటూ సెలవు తీసుకుంది. శోభకృత్ శోభాయమానంగా మొదలైంది. కొత్త సంవత్సరం బాగుండాలని భగవంతుడిని ప్రార్థించి, ఉగాది పచ్చడి రుచి చూసి, పంచాంగ శ్రవణం చేసి, తెలుగువారు రోజంతా సంప్రదాయబద్ధంగా గడిపారు. పలువురు ఆలయాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు. సింహగిరిపై గల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయం, సంపత్ వినాయగర్ ఆలయం, శ్రీ కనకమహాలక్ష్మి ఆలయం, రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తుల తాకిడితో కిటకిటలాడాయి. అలాగే సింహాద్రి అప్పన్న కల్యాణోత్సవాలకు సంవత్సరాది రోజున పెళ్లిరాట వేశారు.



కనకమహాలక్ష్మి సన్నిధిలో భక్తులు



రుషికొండలోని వేంకటేశ్వరస్వామికి సమర్పించేందుకు పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఏఈవో రమేష్



సింహగిరిపై అప్పన్న దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

మౌలిక సదుపాయాల కల్పనపై చర్చ



ప్రాంతీయ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రతినిధులతో జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

దాబాగార్డెన్స్: జీ-20 సమ్మిట్ పురస్కరించుకుని బుధవారం రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో వర్క్‌షాప్ జరిగింది. జన భగీదారి కార్యక్రమంలో భాగంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ అఫైర్స్, హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంయుక్తంగా నగరాలు ప్రైవేట్ ఫైనాన్స్‌ను ఎలా ఉపయోగించుకోవచ్చనే అంశంపై ఈ వర్క్‌షాప్ నిర్వహించాయి. ట్రాన్స్‌పోర్ట్ హబ్, సీ అండ్ డీ వేస్ట్, రూఫ్ టాప్ సోలార్ ప్యానెల్, మొబిలిటీ కార్డ్, పబ్లిక్-బైసిల్ షేరింగ్ తదితర అంశాలపై 10 విజయవంతమైన కేస్ స్టడీలు సమర్పించారు. వాణిజ్య నిధులకు పరిమితులు, 2019 నుంచి 2035 మధ్య కాలంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న 20 నగరాలపై చర్చించారు. జార్జ్ బట్లర్ అంతర్జాతీయ కేస్ స్టడీస్‌తో నాన్-రెవెన్యూ వాటర్‌ను తగ్గించే వ్యూహాలపై మాట్లాడారు. ముందుగా ఆర్థిక వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్ ప్రారంభ ఉపన్యాసం ఇచ్చారు. ప్రైవేట్ ఫైనాన్సింగ్ ప్రాముఖ్యాన్ని వివరించారు. కంట్రీ మేనేజర్ వెండి జో వెర్నర్, ఈయూ ప్రతినిధి బృందం సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ డెల్ఫిన్ బ్రిస్సోనేయు థీమ్ ఔచిత్యం, ఆర్థికవృద్ధి కేంద్రాలుగా నగరాలు ఎలా ముఖ్య పాత్ర పోషిస్తున్నాయనే అంశంపై మాట్లాడారు. పౌరుల మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంపై ఎస్‌బీఎం-యూ మిషన్ డైరెక్టర్ బినయ్‌కుమార్ ఝా, స్మార్ట్ మిషన్ల స్థాయి, పనితీరుపై అమృత్ మిషన్ డైరెక్టర్ లావణ్యకుమార్ చర్చించారు. స్వచ్ఛత యాప్ ద్వారా సేవలు, మహిళల భాగస్వామ్యం, నగరాల రేటింగ్ సిస్టమ్‌ను బినయ్ కుమార్ ప్రదర్శించారు. లావణ్య కుమార్ మిలియన్ ప్లస్ నగరాల్లో నీటి సరఫరా, మురుగునీటి పారుదల ప్రాజెక్టుల్లో పీపీపీ తీసుకోవడంపై వివరించారు. లాల్ చందమా స్మార్ట్‌సిటీలో ట్రాన్స్‌పోర్టు హబ్, సీ అండ్ డీ వేస్ట్, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్లు, మొబిలిటీ కార్డ్, పబ్లిక్ బైసిల్ షేరింగ్‌పై మాట్లాడారు. మాజీ సీనియర్ ఫైనాన్స్ నిపుణుడు మాధవ్‌కుమార్ నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగాపై కేస్ స్టడీ పంచుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్ట్, అప్‌స్ట్రీమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సీనియర్ ఆపరేషన్ ఆఫీసర్ మోహిత్ గనేరివాలా బెల్‌గ్రేడ్ వేస్ట్ టు ఎనర్జీపై చర్చించారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, గోవా, చత్తీస్‌గఢ్, ఒడిశా, లక్షద్వీప్, పుదుచ్చేరి నుంచి పురపాలక కమిషనర్లు, మేయర్లు, అర్బన్ స్టేట్ డిపార్టమెంట్ల ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా.. రెండవ జీ-20 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్(ఐడబ్ల్యూజే) సమావేశం ఈ నెల 28, 29 తేదీల్లో జరగనుంది.

పెళ్లికొడుకైన అప్పన్న

- పరవశించిన భక్తకోటి
- ఘనంగా పెళ్లిరాట మహోత్సవం
- పంచాంగ శ్రవణం, పండిత సత్కారం
- సింహగిరిపై ఉగాది వేడుకలు



అప్పన్న ఉత్సవమూర్తులు



రాజగోపురం వద్ద పెళ్లిరాట వేస్తున్న భక్తులు, అధికారులు, అర్చకులు

సింహాచలం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి పెళ్లిరాట(ఉడుపురాట) ఉత్సవం బుధవారం ఘనంగా జరిగింది. అశేషంగా తరలివచ్చిన భక్తజన సందోహం మధ్య సాయంత్రం 4.30 గంటల నుంచి ఈ ఉత్సవాన్ని సింహాచల దేవస్థానం వైదిక, అధికార వర్గాలు నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని పెళ్లికుమారుడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో సహా ఆలయ ఆస్థాన మండపంలో అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, షోడషోపచార పూజలు నిర్వహించారు.

తొలుత పంచాంగ శ్రవణాన్ని దేవస్థానం పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఘనంగా నిర్వహించారు. తదుపరి మహిళలు పసుపుకుంకుమలతో పెళ్లిరాటలను తీర్చిదిద్దారు. అనంతరం ఆలయ ఉత్తరద్వారం వద్ద, రాజగోపురం వద్ద, వార్షిక కల్యాణోత్సవం జరిగే నృసింహ మండపంలోను పెళ్లిరాటలను వేశారు. ఏప్రిల్ 2న వార్షిక కల్యాణోత్సవం జరగనుంది. దేవస్థానం పూర్వ అనువంశిక ధర్మకర్త పూసపాటి సుధాగజపతిరాజు, దేవస్థానం డిప్యూటీ ఈవో సుజాత, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాసరావు, పిల్లా కృష్ణమూర్తిపాత్రుడు, సువ్వాడ శ్రీదేవి ఈఈ శ్రీనివాసరాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెళ్లిరాటని పురస్కరించుకుని వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి, గోదాదేవి అలంకరణలో కళాకారులు కనువిందు చేశారు. అలాగే ఆలయ రాజగోపురం వద్ద జరిగిన కోలాటం ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

అప్పన్న ఆదాయం 14, వ్యయం 11

శ్రీ శోభకృత్‌నామ సంవత్సరంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామివారి ఆదాయం 14, వ్యయం 11గా పంచాంగం ప్రకారం పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు పేర్కొన్నారు. స్వాతి నక్షత్రం, తులారాశి వాడైన శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామివారికి శుభకృత్‌నామ సంవత్సరంలో వ్యయం కన్నా ఆదాయం మెరుగ్గా ఉందని అభివర్ణించారు. ఏటా ఉగాది రోజు సాయంత్రం స్వామి వారి మూలవిరాట్‌పై సూర్యకిరణాలు పడుతుంటాయి. ఈ ఏడాది కూడా మబ్బులు, వర్షపు జల్లులు కారణంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిపై సూర్యకిరణాలు పడే దృశ్యాన్ని తిలకించే భాగ్యానికి భక్తులు నోచుకోలేదు. ఉగాది పర్వదినం సందర్భంగా సింహాద్రినాధుడి ఆలయం బుధవారం భక్తులతో కిక్కిరిసిపోయింది.

సరకు రవాణాలో 'వాల్తేరు' సూపర్ హిట్!

- వార్షిక సంవత్సరం ముగియకుండానే చేరుకున్న లక్ష్యం
- 2022-23 మార్చి 20 నాటికి 66.92 మిలియన్ టన్నుల లోడింగ్



బొగ్గు రవాణా

సాక్షి, విశాఖపట్నం : వాల్తేరు డివిజన్.. ఏటా మాదిరిగానే ఈసారి కూడా సరకు రవాణాలో సూపర్‌హిట్ కొట్టింది. సరకు రవాణా విషయంలో గణనీయంగా వృద్ధి సాధిస్తూ 2022-23 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ముందుగానే దాటేసింది. మార్చి 20 నాటికి రికార్డు స్థాయిలో 66.92 మిలియన్ టన్నుల లోడింగ్ సామర్థ్యాన్ని చేరుకుంది. బొగ్గు, ఐరన్ ఓర్, బాక్సైట్, అల్యూమినా పౌడర్, ఐరన్ స్టీల్, లైమ్‌స్టోన్, ఫెర్టిలైజర్స్, పోల్, కంటైనర్లతో పాటు ఇతర సరకులు లోడింగ్‌తో ఈ రికార్డు లోడింగ్ సాధ్యమైంది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి వాల్తేరు డివిజన్ చరిత్రలోనే రికార్డు సాధించేలా 70 మిలియన్ టన్నులకు చేరుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

మరింత వృద్ధి సాధిస్తాం



సరకు రవాణా విషయంలో రికార్డు స్థాయికి చేరుకోవడం సంతోషంగా ఉంది. ఇది వాల్తేరు డివిజన్‌లో ఉన్న ప్రతి ఒక్క ఉద్యోగి కృషికి దక్కిన ఫలితం. ప్రయాణికుల మౌలిక సదుపాయాల విషయంలో గానీ, సరకు రవాణా విషయంలోనూ డివిజన్ ఎక్కడా రాజీపడటం లేదు. ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నాం. నిర్దేశించిన సమయానికి ఆయా సంస్థలకు సరుకు లోడింగ్ చేస్తుండటంతో డివిజన్‌పై విశ్వాసం పెరుగుతోంది. రాబోయే రోజుల్లోనూ మరిన్ని రికార్డులు సొంతం చేసుకునే దిశగా.. ప్రతి ఒక్క ఉద్యోగి అంకిత భావంతో పనిచేస్తున్నారు.

– అనూప్‌కుమార్ సత్పతి, వాల్తేరు డీఆర్ఎం

డివిజన్ పరిధిలో లోడింగ్ ఇలా...

2020-21 ఆర్థిక సంవత్సరంలో - 61.17 మిలియన్ టన్నులు


2021-22లో - 66.88 మిలియన్ టన్నులు

2022-23లో- 66.92 మిలియన్ టన్నులు

2022-23లో ఇప్పటి వరకూ జరిగిన సరకు రవాణా వివరాలు

బొగ్గు	- 25.42 మిలియన్ టన్నులు
ఐరన్ ఓర్	- 17.63 మి.ట.
బాక్సైట్	- 5.75 మి.ట.
అల్యూమినా పౌడర్	- 3.6 మి.ట.
ఫెర్టిలైజర్స్	- 2.91 మి.ట.
ఐరన్ అండ్ స్టీల్	- 2.43 మి.ట.
పోల్	- 1.51 మి.ట.
కంటైనర్లు	- 1.37 మి.ట.
ఇతర సరకులు	- 6.3 మి.ట.

స్వర్ణాభరణ అలంకరణలో కనకమహాలక్ష్మి



దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. బుధవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అమ్మవారు స్వర్ణాభరణాలు, పట్టుచీరలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గణపతి పూజ, మండపారాధన అనంతరం ఎస్‌వీఎస్ఆర్‌కే ప్రసాద్ పంచాంగ శ్రవణం చేశారు. దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు దేవాలయంలో గల వేద పండితులు సీహెచ్ఎల్ఎన్ అవధానులు, ఎంవీ ఘనాపాఠి, అర్చకుడు బి.శేషుభట్టార్‌కి పండిత సత్కారం జరిగింది. కార్యక్రమంలో ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



అర్చకులను సత్కరిస్తున్న ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం

క్లుప్తంగా

నేటి నుంచి ఉక్కు అధికారులు నల్లబ్యాడ్జీల నిరసన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అధికారులు గురువారం నుంచి నల్ల బ్యాడ్జీల నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉక్కు అధికారుల పెండింగ్ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో వారు నిరసన బాట పట్టారు. ఉక్కు అధికారుల పదోన్నతులను సత్వరమే విడుదల చేయాలని, 2021–22లో లాభాలు వచ్చినందున అధికారులకు ఇవ్వాల్సిన పీఆర్పీ వెంటనే ఇవ్వాలని, 2017 నుంచి అమలు చేయాల్సిన వేతన సవరణ వెంటనే చేయాలని, వేతన ఒప్పందంలో భాగంగా పెన్షన్ బకాయిలు వెంటనే ట్రస్ట్ ఖాతాల్లో జమ చేయాలన్న డిమాండ్లపై ఈ కార్యక్రమం చేపట్టారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో అధికారులంతా బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తారని ఉక్కు అధికారుల సంఘం (సీ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటం చంద్రరావు, కె.వి.డి. ప్రసాద్ తెలిపారు.

మోదమాంబ, మెట్రో సీసీ జట్ల విజయం

విశాఖ స్పోర్ట్స్: యూసీసీ టీ20 క్రికెట్‌లో భాగంగా మోదమాంబ జట్టు మెట్రోసీసీ జట్టు విజయం సాధించాయి. వైఎస్సార్ స్టేడియంలో బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గాజువాక గ్రీన్స్ ఆరు వికెట్లకు 167 పరుగులు చేసింది. ప్రతిగా మోదమాంబ జట్టు మరో రెండు బంతులుండగానే తొమ్మిది వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. సింహాద్రి 74పరుగులు చేశాడు. అప్పన్న నాలుగు వికెట్లు తీశాడు. మరో మ్యాచ్‌లో యలమంచిలి సీసీ 13.2 ఓవర్లలో 44 పరుగులకే ఆలౌటైంది. ప్రతిగా మెట్రోసీసీ వికెట్ కోల్పోకుండానే విజయాన్నందుకుంది. పోటీల ప్రారంభ కార్యక్రమంలో ఏసీఏ సీఈవో శివారెడ్డి ట్రోఫీలు ఆవిష్కరించారు.

బతుకు బండి

- ఆదాయం, ఆదరణ లేకున్నా వాటితో వీడని బంధం
- స్మార్ట్ సిటీలో ఉనికి కోసం రిక్షావాలాల తాపత్రయం
- ఒకప్పుడు విశాఖ వీధుల్లో 1,500కు పైగా రిక్షాలు
- నేడు 30కి పడిపోయిన సంఖ్య
- ఆటోలు, బైక్‌ల తాకిడితో క్రమంగా కనుమరుగు

సాక్షి, విశాఖపట్నం: కొన్ని బంధాలు అంతే.. జీవితాంతం తోడుగా ఉంటాయి. తాము ఎంచుకున్న వృత్తి ఉపాధినీయకపోయినా, కడుపు నింపకపోయినా వదులు కోవడానికి ఇష్టపడరు. ఒకప్పుడు బతుకునిచ్చిందన్న భావనతో నేటికీ ఆ బతుకు బండితోనే సహజీవనం చేస్తుంటారు. అలాంటి కోవలోకే వస్తారు కొందరు రిక్షావాలాలు. కొన్ని దశాబ్దాల క్రితమే కాలం చెల్లినా.. డిమాండ్ తగ్గినా ఇప్పటికీ ఆ రిక్షాలతోనే తమ అనుబంధాలను కొనసాగిస్తున్నారు. స్మార్ట్ సిటీలో ఇప్పటికీ ఇదే బతుకు బండిని లాగిస్తూ ఉనికిని చాటుకుంటున్నారు.

బతుకునిచ్చిన బండిని వదులుకోలేక..

ఒకప్పుడు విశాఖ నగర వీధుల్లో 1,500కు పైగా రిక్షాలు తిరిగేవి. ప్రజల రవాణా అవసరాల్లో సింహభాగం ఇవే తీర్చేవి. ఆస్పత్రులకు, బస్టాండ్లకు, అక్కడ నుంచి ఇళ్లకు వెళ్లాలన్నా, షాపింగ్‌కు వెళ్లి రావాలన్నా, బడి పిల్లలను స్కూలుకు పంపాలన్నా ఈ రిక్షాలే ముందుండేవి. ప్రతి చోటా రిక్షా స్టాండ్లు ఉండేవి. కాలం మారింది. ప్రజల జీవనశైలిలోనూ మార్పు వచ్చింది. ఆటోలు, సిటీ బస్సులతో పాటు సొంత వాహనాలూ ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. ఇవి నగర రోడ్లపై చీమల దండును తలపించేలా తిరుగుతున్నాయి. వాటి ప్రభావంతో క్రమంగా రిక్షాలు కనుమరుగవుతూ వచ్చాయి. కానీ విశాఖ నగరంలో నేటికీ కొంతమంది రిక్షా పుల్లర్లు వృద్ధాప్యం మీద పడినా ఒకప్పుడు తమకు బతుకునిచ్చిన బండిని వదులుకోలేక పోతున్నారు. ఒంట్లో ఓపిక లేకపోయినా, కాళ్లలో సత్తువ లేకపోయినా పంటి బిగువున బతుకు బండి లాగుతున్నారు. వాటిపై మమకారాన్ని చంపుకోలేక పోతున్నారు. అలాగని అవేమీ వారికిప్పుడు ఆశించిన ఆదాయాన్ని కూడా తెచ్చి పెట్టడం లేదు. చాలీచాలని రాబడి వస్తున్నా, దాంతో కుటుంబ పోషణ జరగక పోయినా వాటిని వదులుకోవడం లేదు. యుక్తవయసు నుంచీ రిక్షా తొక్కే వృత్తినే ఎంచుకున్న వీరికి మరో వృత్తి చేతకావడం లేదు. దీంతో నమ్ముకున్న వృత్తిని, రిక్షా బండితోనే కాలక్షేపం చేస్తూ వస్తున్నారు. పాత తరంలో కొనసాగుతున్న వారే తప్ప కొత్తగా ఈ వృత్తిలోకి ఏ ఒక్కరూ రావడం లేదు.

1500 నుంచి 30కి..

నాలుగైదు దశాబ్దాల క్రితం విశాఖలో 1,500కు పైగా రిక్షాలుండగా ఇప్పుడవి 30కి పరిమితయ్యాయి. రిక్షాలెక్కే వారు లేకపోవడంతో వీటికి ఆదరణ తగ్గిపోయింది. దీంతో ఆ వృత్తిలో ఉన్న వారు ఒక్కొక్కరుగా కాలం చేశారు. ఇంకా మిగిలి ఉన్న వారిలో ఆరోగ్యవంతులు కొందరు పాత రిక్షాలకే మరమ్మతులు చేయించుకుంటూ తొక్కుతున్నారు.


రిక్షా తొక్కుతున్న అప్పారావు

వీరు బడిపిల్లలను, వృద్ధులను తీసుకెళ్లే పని ఒప్పుకుంటున్నారు. ఇలా నగరంలో ప్రస్తుతం పూర్ణామార్కెట్, కెప్టెన్ రామారావు జంక్షన్, రైల్వేస్టేషన్, అక్కయ్యపాలెం ప్రాంతాల్లో ఇలాంటి వారు కనిపిస్తున్నారు.

మరో పని చేతకాక..

నా వయసు 76 ఏళ్లు. యాభై ఏళ్ల నుంచి రిక్షా నడుపుతున్నాను. రిక్షాలను ఆదరించే వారు లేకపోయినా మరో వృత్తి చేతకాక రిక్షానే లాగుతున్నాను. ఆటోలు అంతగా లేని రోజుల్లో పాతికేళ్ల క్రితం స్కూలు పిల్లలను తీసుకెళ్తే రూ.2 వేలు వచ్చేది. ఇప్పుడు ఇద్దరు బడి పిల్లలను మాత్రమే తీసుకెళ్తున్నాను. అందుకు నెలకు రూ.వెయ్యి ఇస్తున్నారు. వృద్ధులు కొందరు రిక్షా ఎక్కడానికి ఇష్టపడతారు. ఇలాంటి వారి నుంచి రోజుకు రూ.100–150 వస్తుంది. ఏదైనా సరకు రవాణా చేస్తే మరో రూ.100 లభిస్తుంది. ఈ అరకొర ఆదాయంతోనే కుటుంబాన్ని పోషిస్తున్నాను. ఒంట్లో ఓపికున్నంత వరకు రిక్షాను తొక్కుతాను.

– లొంగలి అప్పారావు, అక్కయ్యపాలెం

రోడ్డు ప్రమాదంలో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ మృతి

కొమ్మాది: విధులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తున్న ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం సాయంత్రం బీచ్‌రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాలాక్షినగర్‌కు చెందిన మేడిశెట్టి సన్యాసిరావు (53) భీమిలి బ్యాంక్ కాలనీ ఐజీ బంగ్లా వద్ద ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం విధులు ముగించుకొని భీమిలి నుంచి ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా బీచ్‌రోడ్డు ఉప్పాడ దరి చొక్కవానిపాలెం వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం అయన్ని బలంగా ఢీ కొట్టింది. దీంతో సన్యాసిరావు అపస్మారక స్థితిలో చేరుకున్నాడు. స్థానికులు వెంటనే అతడిని రుషికొండలో గల ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నగరంలో గల ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే ప్రమాదానికి కారణమైన యువకుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో ఎస్‌ఐ తాతారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపురూప కళాఖండాల వేదిక



అరుదైన వస్తువులు

ఏయూక్యాంపస్: అపురూప, అరుదైన వస్తువుల వేదికగా జస్ట్ జడ్జ్ నిలుస్తుందని సంస్థ నిర్వాహకురాలు మౌనిక అన్నారు. పెదవాల్తేరు జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జస్ట్ జడ్జ్ ఆర్టిస్టిక్స్, లైఫ్ స్టైల్ షోరూంను బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దశాబ్దాల కిందట వినియోగించిన అపురూప వస్తువులను ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి సేకరించినట్లు చెప్పారు. వీటిని కళాత్మక దృష్టితో చూసేవారికి, ఇష్టపడే వారికి విక్రయిస్తామన్నారు. చరిత్రకు సాక్ష్యాలుగా ఈ కళారూపాలు నిలుస్తాయన్నారు. ప్రాచీన కాలంలో వినియోగించిన చెక్క వస్తువులు, అలంకరణ వస్తువులు, ఇత్తడి కళారూపాలు వంటివి ఇక్కడ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో జె.వెంకట రాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న దేవస్థానంలో ఉగాది పురస్కారాలు


మావూరి వెంకటరమణకు ఉగాది పురస్కారం అందజేస్తున్న స్థానాచార్యులు తదితరులు


ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులకు ఉగాది పురస్కారం అందజేస్తున్న అధికారులు

సింహాచలం : ఉగాదిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో పనిచేస్తున్న పలువురు వైదికులకు, దాతలకు బుధవారం ఉగాది పురస్కారాలను అందజేశారు. దాతల విభాగంలో సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, వల్లభనేని కృష్ణప్రసాద్‌కి పురస్కారాలు అందజేశారు. పండితుల విభాగంలో దేవస్థానం ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, వేద పండితుడు సుబ్రహ్మణ్య శర్మ, వేద పారాయణదారుడు ఎమ్.కె.వి.కె. రామానుజం, దేవస్థానం పంచాంగకర్త తెన్నేటి శ్రీనివాసశర్మ, హెడ్ కుక్ నరసింహమూర్తిని ఘనంగా సత్కరించి ఉగాది పురస్కరాలను అందజేశారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు, ఈఈ రాంబాబు, ఏఈ హరి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ కోసం ఘర్షణ.. ఒకరి మృతి

అల్లిపురం: సెల్‌ఫోన్ కోసం ముగ్గురి మధ్య జరిగిన ఘర్షణలో ఒకరి ప్రాణం పోయింది. ఫిషింగ్ హార్బర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ రేవతి తెలిపిన వివరాలివీ.. ఫిషింగ్ హార్బర్ జెట్టీ–2లో మంగళవారం రాత్రి ఓ బోటులో ఆ బోటు డ్రైవర్, ఇద్దరు వాచ్‌మెన్ కలిసి మద్యం సేవించారు. ఈ క్రమంలో వారి మధ్య సెల్‌ఫోన్ కోసం గొడవ జరిగింది. గొడవ క్రమంగా పెరిగి కొట్లాటకు దారితీసింది. ఈ ఘటనలో బోటు డ్రైవర్ కంబాల దేవుడు (48)కి తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన ఇద్దరు కొట్టిన దెబ్బలను తట్టుకోలేక దేవుడు మరో బోటులోకి వెళ్లి తలదాచుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు అతన్ని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దేముడు బుధవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. కంబాల దేముడుది అచ్యుతాపురం మండలం, పూడిమడకగా గుర్తించారు. అతనిపై దాడికి పాల్పడిన ఇద్దరిది భీమిలి మండలం, అన్నవరం. నిందితులిద్దరూ పరారీలో ఉన్నారు. మృతదేహాన్ని పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

నేడు జాబ్‌మేళా

ఎంవీపీకాలనీ: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఉపాధి కల్పన మిషన్ (సీడాప్), డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ జాబ్‌మేళా ద్వారా 10 కంపెనీల్లో 417 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. హనీగ్రూప్, రిలయన్స్, అపోలో, మెడ్‌ప్లస్, మ్యాక్స్, రిలయన్స్ డిజిటల్స్, స్పెన్సర్, ఖజానా జువలరీస్, వరుణ్ మోటార్స్, రిలయన్స్ ఫుడ్‌ప్రింట్స్ కంపెనీల్లో ఖాళీల భర్తీకి కోసం నిర్వహించనున్న ఈ మేళా పెందుర్తిలోని జిల్లా సమైక్య భవన్‌లో ఉదయం 10 గంటలకు జరగనుంది. వివరాలకు 73867 13880 నంబర్‌లో సంప్రదించవచ్చు.

విశాఖ జిగేల్


చెట్లకు నీరు పోస్తున్నట్టుగా...



సీతకొండ వద్ద సెల్ఫీ పాయింట్


బీచ్‌రోడ్డులోని కొబ్బరి చెట్ల మధ్యలో లైటింగ్

దాబాగార్డెన్స్: మహా విశాఖ నగరం.. తన రూపురేఖలు మార్చుకొని, నూతన సొబగులు అద్దుకుంటోంది. ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించే జీ–20 సమ్మిట్‌కు అందంగా ముస్తాబవుతోంది. రెండు నెలలుగా చేపడుతున్న నగర సుందరీకరణ పనుల కొలిక్కి వస్తున్నాయి. ఇప్పటికే డివైడర్లకు రంగులు పూర్తి చేశారు. దేశభక్తి ప్రతిబింబించేలా చెట్లకు జాతీయ జెండా రంగులు వేశారు. బీచ్‌రోడ్‌ను అద్దంలా తీర్చిదిద్దారు. మరో వైపు పలు ప్రాంతాల్లో నూతనంగా రహదారులు నిర్మించారు. ముఖ్యమైన కూడళ్లను మినీ పార్కులుగా తీర్చిదిద్దారు. అందమైన పూల మొక్కలు, బొన్సాయ్ మొక్కలతో జంక్షన్లు కొత్త దనాన్ని సంతరించుకున్నాయి. మన సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేసేలా ఖాళీ గోడలపై అందమైన చిత్రాలు చిత్రీకరించారు. పలు ప్రాంతాల్లో సెల్ఫీ పాయింట్లను అభివృద్ధి చేశారు. కొండలపై తీర్చిదిద్దిన సందేశాత్మక చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. విద్యుత్ లైట్ల మధ్య బీచ్ రోడ్డులోని కొబ్బరి చెట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ.. పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు.


చెట్లకు మువ్వన్నెల జెండా రంగులు


తెన్నేటి పార్కు ఎదురుగా..


కొండపై బొమ్మలు వేస్తున్న చిత్రకారులు


బీచ్ రోడ్డులో కనువిందు చేస్తున్న చెట్లు


బీచ్‌రోడ్డులో పచ్చతోరణం

నగరంలో నేడు

- ఉదయం 10.30 గంటలకు జగదాంబ సీఐటీయూ కార్యాలయంలో 'ఏప్రిల్ 5 చలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ
- మధ్యాహ్నం 2 గంటలకు ఆర్కే బీచ్ నుంచి సాగరనగర్ వరకు బోట్‌రేసింగ్ కార్యక్రమం
- సాయంత్రం 5 గంటలకు మధురవాడలోని శిల్పారామంలో గాంధీ శిల్పా బజార్ ఎగ్జిబిషన్ ప్రారంభం

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.59,130
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.54,200
వెండి(కిలో):	రూ.74,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	రూ.103
స్కిన్	రూ.176
స్కిన్‌లెస్	రూ.186

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	450.00
విజయనగరం	454.00
శ్రీకాకుళం	454.00

'పది'ంతల శ్రద్ధ

- 10వ తరగతి పరీక్షలకు అధికారుల సన్నద్ధం
- ఏప్రిల్ 3 నుంచి పబ్లిక్ పరీక్షలు
- మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థులకు తర్ఫీదు
- 447 పాఠశాలల నుంచి 29,260 మంది హాజరు

విశాఖ విద్య: 10వ తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. విశాఖపట్నం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని 447 పాఠశాలల నుంచి 27,547 మంది రెగ్యులర్ విద్యార్థులు ఈ ఏడాది పది పరీక్షలకు హాజరవుతున్నారు. వీరిలో బాలురు 14,255, బాలికలు 13,292 మంది ఉన్నారు. మరో 1,713 మంది విద్యార్థులు ప్రైవేట్‌గా(వన్స్ ఫెయిల్డ్) పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో 136 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు సంబంధించిన సామగ్రి(ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాలు)ని భద్రపరిచేందుకు వీలుగా జిల్లాలోని పోలీస్‌స్టేషన్లను ఇప్పటికే గుర్తించారు. కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది నియామక ప్రక్రియ ప్రస్తుతం జరుగుతోంది.

నంబర్ వన్ లక్ష్యం

ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించేలా జిల్లా విద్యాశాఖాధికారులు ఫోకస్ పెట్టారు. 2017–18, 2018–19 సంవత్సరాల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు 96 శాతం ఉత్తీర్ణత సాధించారు. కోవిడ్ నేపథ్యంలో రెండేళ్ల పాటు పరీక్షలు నిర్వహించలేని పరిస్థితుల్లో అందరూ పాసయ్యారు.

కోవిడ్ తర్వాత 2021–22 విద్యా సంవత్సరంలో నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పడిపోయింది. 73.11 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత చెందారు. గత పదేళ్ల కాలంలో ఇదే తక్కువ ఉత్తీర్ణత శాతం కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఈ సారి 10వ తరగతి చదువులపై ప్రత్యేక దష్టి సారించారు. ఫలితాల్లో విశాఖ రాష్ట్రంలో నంబర్ వన్ స్థానంలో నిలిచేలా విద్యాశాఖాధికారులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నారు.

ప్రత్యేక తరగతులపై ఫోకస్

ప్రీ ఫైనల్ పరీక్షలు ఇటీవల ముగిశాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసే క్రమంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5.30 వరకు సబ్జెక్టుల వారీగా ఎలా చదవాలనేది టైం టేబుల్ రూపొందించి, అమలు చేస్తున్నారు. పరీక్షలు ప్రారంభానికి ముందురోజు వరకు ఇదే రీతిన ప్రత్యేక తరగతులు కొనసాగేలా షెడ్యూల్ సిద్ధం చేశారు.


అక్కయ్యపాలెం హైస్కూల్‌లో ప్రీ ఫైనల్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)


తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి



పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నాం. సబ్జెక్టు ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలకు నిర్దిష్టమైన ఆదేశాలిచ్చాం. పబ్లిక్ పరీక్షల దృష్ట్యా విద్యార్థుల తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలి. పిల్లలు ఇంటి వద్ద ఎలా చదువుతున్నారనేది పరిశీలించాలి. అందుకనే రాత్రి వేళల్లో మేము కూడా ఇళ్లకు వెళ్తున్నాం.

–ఎల్. చంద్రకళ, డీఈవో, విశాఖ జిల్లా

ప్రతి రోజూ పరీక్ష



షెడ్యూల్ మేరకు ప్రతి రోజూ సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారనేది గుర్తించి, వారికి మరింత అవగాహన కల్పిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులను సీ, డీ గ్రేడ్‌గా గుర్తించి.. అలాంటి వారు కచ్చితంగా పాస్ అయ్యేలా, ఏ, బీ గ్రేడ్‌లో ఉన్న వారిని టాప్ మార్కులు సాధించేలా తర్ఫీదు ఇస్తున్నాం.

–ఇమంది పైడిరాజు, హెచ్‌ఎం, జడ్పీ హైస్కూల్, అడవివరం

కట్టుదిట్టమైన ఏర్పాట్లు

పదో తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నాం. పరీక్ష కేంద్రాలుగా గుర్తించిన పాఠశాలల్లో విద్యార్థులకు తగిన వసతి సౌకర్యాలు కల్పించేలా దృష్టి పెట్టాం. పాఠశాలల వారీగా హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. వీటిని డౌన్‌లోడ్ చేసి, హెచ్‌ఎంలంతా వాటిని విద్యార్థులకు అందజేయాలి.

–ఎస్.మురళీ మోహన్, ప్రభుత్వ పరీక్షల జిల్లా అసిస్టెంట్ కమిషనర్